క్లుప్తంగా

నేడు పీబీ దేవంలో దొరబాబు ప్రచారం

సామర్లకోట: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు బుధవారం ఉదయం మండల పరిధిలోని పీబీ దేవం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దొరబాబుతో పాటు భార్య చంద్రకళ, రెండవ కుమార్తె సార్విక ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

సీతారాముల కల్యాణానికి పసుపురాట ముహూర్తం


వాకతిప్పలో పసుపురాట వేస్తున్న భక్తులు

కొత్తపల్లి: వాకతిప్ప శాలివాన పద్మశాలి రామాలయం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవాలకు మంగళవారం భక్తులు పసుపురాట ముహూర్తం వేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. 17న జరగనున్న కల్యాణ మహోత్సవాలకు మండలంలోని ఆలయాలను ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

నూకాలమ్మ తల్లిని దర్శించిన భక్తులు

సామర్లకోట: గ్రామ దేవత నూకాలమ్మ తల్లిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయంలో ఉచిత దర్శనంతో పాటు రూ.10, రూ.20 దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్తలు వల్లూరి బుల్లియ్య, ఈదల ఈశ్వరకుమార్, కర్రి ఆదినారాయణరెడ్డి, ఎం.పెద్దకాపు, బొమ్మాలరావు, పెనుమర్తి సత్యనారాయణ, యార్లగడ్డ శ్రీనివాసు తదితరులు సేవలందించారు.

చలివేంద్రం ఏర్పాటు


సామర్లకోటలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

సామర్లకోట: స్థానిక బసివిరెడ్డి సత్రం వద్ద పెద్దాపురం శ్రీ లక్ష్మీగణపతి ఆటో యూనియన్ కార్యాలయం వద్ద మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు సోమేష్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో బాటసారులకు ప్రతి రోజు మజ్జిగ పోయాలని నిర్ణయించినట్టు తెలిపారు. 80 లీటర్ల పెరుగుతో 400 లీటర్ల మజ్జిగ ప్రజలకు పంపిణీ చేయనున్నట్టు వారు తెలిపారు.

భువనేశ్వరి పీఠం ఆధ్వర్యంలో..

పెద్దాపురం: భువనేశ్వరి పీఠం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి అన్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం స్థానిక మెయిన్‌రోడ్డులో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోపిశర్మ మాట్లాడుతూ భువనేశ్వరి పీఠం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. పుర ప్రజలు పీఠం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జాతీయ సమైక్యతే లక్ష్యం


ఖిద్మత్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది ఉత్సవంలో పాల్గొన్న హిందూ, ముస్లిం ప్రతినిధులు

కాకినాడ సిటీ: మన కాకినాడ, మన ఉగాది, మన రంజాన్ అనే శీర్షికతో కాకినాడ ఖిద్మత్ కమిటీ వ్యవస్థాపక మాజీ అధ్యక్షులు హసన్ షరీఫ్ అధ్యక్షతన కాకినాడ పీఆర్ భవన్‌లో ఉగాది, రంజాన్ పండుగ వేడుకల సందర్భంగా మంగళవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భోగి గణపతి పీఠాధిపతి దూసర్లపూడి రమణరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత దేశ పరిస్థితులకు మతం ఆధారితంగా చట్టాలను చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు, ముస్లిం సమాజంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని హిందూ బంధువులు అందరూ ఖండించి వారికి అండగా నిలవాలన్నారు. హసన్ షరీఫ్ మాట్లాడుతూ ఖిద్మత్ కమిటీ ఎల్లప్పుడు జాతి సమైఖ్యతను కాంక్షిస్తుంది. అని అందుకే ఆపదలో ఉన్న వారు ఏ మతం అని చూడకుండా సభ్యులు ఆచరణాత్మకంగా భారత దేశ లౌకిక స్వరూపాన్ని చాటుతున్నట్టు వివరించారు. అనంతరం సమాచార హక్కు చట్టం రాష్ట్ర సమితి నాయకులు పప్పు దుర్గారమేష్ మాట్లాడుతూ వచ్చే ఏడాది హిందువు, ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చి మరింతగా కాకినాడలో ఐకమత్యాన్ని చాటుదామని పిలుపునిచ్చారు. కమిటీ అధ్యక్షులు చిష్టి కార్యదర్శి హుస్సేన్, కోశాధికారి గౌస్, సభ్యులు ఫక్రుద్దీన్ అలీ, నసీర్ సాధిక్, గణేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.


పాదగయ క్షేత్రంలో ఉగాది పూజలలో ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి


శాంతివర్ధనలో ఉగాది వేడుకలు


ఉగాది సభలో మాట్లాడుతున్న ఉమర్ ఆలీషా


వాకతిప్ప రామాలయం వద్ద సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు


మరిడమ్మ ఆలయంలో పంచాంగ పఠనం ఆశీర్వచనం అందుకుంటున్న కమిషనర్

క్రోధి నామమైనా అంతా శుభమే..!

- ఘనంగా ఉగాది వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉగాది పచ్చడి పంపిణీ
- కళకళలాడిన గ్రామాలు

పిఠాపురం: క్రోధి నామ తెలుగు సంవత్సరాది ఉత్సవాలు మంగళవారం పిఠాపురం నియోజకవర్గంలో వాడవాడలా అంబరాన్నంటాయి. అన్ని గ్రామాల్లోను ప్రతి ఒక్కరూ సాంప్రదాయ వస్త్రధారణలో కనిపించడంతో తెలుగుదనం ఉట్టిపడింది. తెల్లవారు జాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. ప్రతీ ఇంటాఉగాది పచ్చడి తయారు చేసుకుని బంధుమిత్ర సపరివారంగా పచ్చడి సేవించారు. క్రోధ నామ తెలుగు సంవత్సరాదిలో పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఉగాది సందర్భంగా వేద పండితులు ఆధ్వర్యంలో పంచాంగ పఠనం జరిగింది. ఈ ఏడాది అందరికీ శుభాలు కలుగుతాయని అంతా సస్య శ్యామలంగా ఉంటుందని పేరుకు తగ్గట్టుగా క్రోధం అంతగా ఉండదని వర్షాలు అధికంగా కురుస్తాయని, పాడి పరిశ్రమ, రైతులకు మంచి మేలు జరుగుతుందంటూ పంచాంగ శ్రవణంలో పండితులు తెలిపారు. పిఠాపురంలో కుంతీమాధవస్వామి, శ్రీగణేష్, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం, వేణుగోపాల స్వామి ఆలయం తదితర ఆలయాల్లో ఉగాది సంబరాలు కనుల పండువగా నిర్వహించారు. పలు దేవాలయాల వద్ద విసెన కర్రలు, ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వివిధ గ్రామాల్లో రైతులు ఏరువాక సాగారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా దేవి ఆలయంలోను, దుర్గాడ రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించగా స్వామివారు ప్రత్యేకాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో పీఠాధిపతి ఉమర్ ఆలీషా ఉగాది సందర్భంగా భక్తులకు అనుగ్రహ బాషణ చేశారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో

పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన ఉగాది ఉత్సవాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీత పాల్గొన్నారు. ఆమెకు పలువురు నేతలు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుభిక్షింగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు పలువురు నేతలు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తపల్లి మండలంలో...

కొత్తపల్లి: తెలుగు నూతన సంవత్సరం ఉగాది వేడుకలు మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కొత్తపల్లిలో వేణుగోపాలస్వామి, రాజశేఖరస్వామి, ఉప్పాడలోని మత్స్యలింగేశ్వరస్వామి, వెంకటేశ్వర స్వామి, రామలింగేశ్వరస్వామి, రమణక్కపేటలో విజయ జనార్దనస్వామి, మూలపేటలో జగన్నాథ స్వామితో పాటు నాగులాపల్లి, గోర్స గ్రామాల్లోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వార్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు


వంగా గీతకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు అభిమానులు

పెద్దాపురంలో...

పెద్దాపురం: దేశ సంస్కృతి, సాంప్రదాయ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్డీఓ, మున్సిపల్, కార్యాలయంలో శ్రీ క్రోధి నామ సంవత్సరాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రంచాంగ శ్రవణం అనంతరం ఆర్డీఓ జేఎస్ రామారావు, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది ప్రజలకు మరింత మంచి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. స్థానిక మరిడమ్మ ఆలయంలో ఉగాది సందర్భంగా ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వి రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేద పండితులు పంచాంగ పఠనం చేశారు. మున్సిపల్ కమిషనర్ పద్మావతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సీనియర్, జూనియర్ సహాయకులు జగన్నాథం, మహేష్, సుధాకర్, రోజా తదితరులు పాల్గొన్నారు. అలాగే శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో డైరెక్టర్లు రాయవరపు వీరబాబు, సత్య దంపతుల ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు.

గొల్లప్రోలు మండలంలో...

గొల్లప్రోలు: మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలంలోని చేబ్రోలు, దుర్గాడ , చెందుర్తి, వన్నెపూడి, కొడవలి, తాడిపర్తి, ఏపీ మల్లవరం, ఎ.విజయనగరం గ్రామాల్లో తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేబ్రోలులో శ్రీసాయి వీరాంజనేయ గుడి వద్ద జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు ఆధ్వర్యంలో మిల్లుగొరువు సెంటర్లో నిర్వాహకులు వులవల నాగన్న, ఓరుగంటి రాంబాబు ప్రోత్సాహంతో గ్రామస్తులకు, బాటచారులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వన్నెపూడి గ్రామ రామాలయంలో ఆకొండి వెంకటేశ్వర శర్మ (బాబి) పంచాంగ పఠనం నిర్వహించారు.


గ్రామస్తులకు, బాటసారులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న నాయకులు

భక్తి శ్రద్ధలతో వసంత నవరాత్ర ఉత్సవాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వసంత నవరాత్ర ఉత్సవాలు ప్రారంభించారు. ఉగాది పర్వదినం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ నెల 17 వరకు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్య నారాయణమూర్తి, వినయ్, అళ్లకి రాజ్‌గోపాల్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని నంది మండపం వద్ద స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు నిర్వహించారు. వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, పంచాంగ పఠనంతో వసంత నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి లలిత అష్టోత్తర సహస్రనామాలు, కుంకుమార్చనలు చేశారు. వసంత నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల గోత్ర నామాలు చదవడానికి రూ.200 చెల్లించి రసీదు పొందాలన్నారు. భక్తులు పంచాగ శ్రవణంలో అధిక సంఖ్యలో పాల్గొన్ని ఉగాది పచ్చడిని స్వీకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. భక్తులకు నూతన సంవత్సర పంచాంగాలను అందజేశారు. తహీల్దార్ శ్రీనివాస రావు, భక్త సంఘ నాయకుడు బిక్కిన పరమేశ్వర స్వామి, మానవహక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు, వీఆర్వో మురళీలు పాల్గొన్నారు.


సామర్లకోట మాండవ్యనారాయణస్వామి ఆలయంలో పంచాంగ పఠనం

పట్టణ పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమరరామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ ఘనపాటి వేమూరి సోమేశ్వరశర్మ పంచాంగ పఠనం చేశారు. సాయంత్రం అతి పురాతన మాండవ్య నారాయణస్వామి ఆలయంలో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కంటే బాబు, యార్లగడ్డ బాపినీడుల ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం జరిగింది. పండితులు చోనాల సురేష్‌శర్మ, సీహెచ్ హనుమశాస్త్రిలు పంచాంగ పఠనం చేశారు. అనంతరం రైతు సంఘ సర్వసభ సమావేశం జరిగింది. ఏడాది కాలంలో రైతు సంఘానికి వచ్చిన ఆదాయం, ఖర్చుల వివరాలను కార్యదర్శి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అలాగే స్థానిక కనక మహాలక్ష్మి ఆలయంలోను పంచాగ శ్రవణం జరిగింది.


బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామభీమేశ్వరస్వామి కల్యాణం

నేత్ర పర్వంగా భీమేశ్వర కల్యాణం

ఈ సందర్భంగా భీమేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. నంది మండపం వద్ద వేదికపై ఉత్సవ మూర్తులను ఉంచి కల్యాణం నిర్వహించారు. బిక్కిన సాయి దంపతులు, రాజశేఖర్ దంపతులు కర్తలుగా కల్యాణం జరిగించారు. ఉగాది రోజున స్వామి వారి కల్యాణం జరగడం ఈ ప్రాంత ప్రజలకు శుభ సూచికమని ఆలయ వేదపండితులు వేమూరి సోమేశ్వరశర్మ తెలిపారు.

అలరించిన చిన్నారుల నృత్యప్రదర్శనలు

స్థానిక స్టేషన్ సెంటర్‌లోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో ఆంధ్రాసాయిగీతా సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భక్తి గీతాల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత

పెద్దాపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు నచ్చి మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు పెద్దాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నుంచి భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని ఆనూరు గ్రామంలో మంగళవారం ఎంపీటీసీ చిట్టూరి లోవమణి, వెంకట్రావుతో పాటు సుమారు 50 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు దొరబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికి దొరబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. అనంతరం ఎంపీటీసీ లోవమణి, వెంకట్రావుతో పాటు చిట్టూరి వెంకటేశ్వర్ల, పుల్లయ్య వెంకట్రాజు, వల్లూరి రూపలయ్య, బల్ల వెంకటరమణ, సానా స్వామి, బల్ల నారాయణరావుతో సుమారు 50 మందిని పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ మాజీ ఎంపీటీసీ సింగన త్రిమూర్తులు, కూనపురెడ్డి స్వామి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ కార్యకర్తలతో దొరబాబు

చిత్రాడలో టీడీపీకి ఎదురుదెబ్బ

పిఠాపురం: చిత్రాడ గ్రామంలో టీడీపీ, జనసేనలకు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ నుంచి 25 కుటుంబాలు మంగళవారం వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ గుడాల రామకృష్ణ, వైస్ సర్పంచ్ కర్రి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి వంగా గీత పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జవ్వాది నాయుడు పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి తీర్థం

కరప: గొడ్డటిపాలెం గ్రామదేవత మహాలక్ష్మి తల్లి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాది రోజున నిర్వహించే ముందురోజు రాత్రి తెల్లవార్లూ గరగ నృత్యాలు, గారడీలతో అమ్మవారికి జాతర నిర్వహించారు. గ్రామస్తులు, పరిసర గ్రామాలవారు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో కలసి సర్పంచ్ శ్రీనుబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పల్లపువీధిలో గంటాలమ్మ తీర్థం..

పంచాయతీ పరిధిలోని పల్లపువీధి గ్రామదేవత గంటాలమ్మ తీర్థం మంగళవారం జరిగింది. వేద పండితులు ముత్యం ప్రసాదరావు ఆధ్వర్యంలో కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం బృందం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరప పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పిఠాపురం సంస్కృతిని పాడుచేయకండి

వర్మ ఆరోపణలపై వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీత మండిపాటు

పిఠాపురం: ప్రజలందరూ సామరస్యంగా కలసిమెలసి ఉండే ఆధ్యాత్మిక కేంద్రమైన పిఠాపురం సంస్కృతిని పాడు చేయవద్దని, కొత్త సంస్కృతిని తీసుకురావద్దని టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మపై కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత మండిపడ్డారు. భారీగా డబ్బు ఖర్చు చేస్తున్నారని, డమ్మీ ఈవీఎంలతో అధికారులను మభ్యపెట్టి డబ్బు సంచులు తరలిస్తున్నారని వర్మ మంగళవారం చేసిన ఆరోపణలపై ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు. ఫేక్ వీడియోలు సృష్టించి, టీడీపీ అసత్య ప్రచారాలకు తెర లేపిందన్నారు. వర్మ ఆరోపణలు పూర్తిగా అసత్యమని కొట్టిపారేశారు. గత వారంలో పార్టీ మెటీరియల్‌తో తుని వెళుతున్న వాహనాన్ని అధికారులు ఆపితే అందులో డబ్బు ఉందని వర్మ ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారులు పూర్తిగా తనిఖీ చేసినప్పుడు అందులో డబ్బు ఎందుకు లేదో చెప్పాలని వర్మను డిమాండ్ చేశారు. అధికారులు వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహనంలో అనుమతి పత్రాలు లేనందువలన అదుపులోకి తీసుకున్నారు తప్ప మరే ఇతర కారణాలూ లేవని స్పష్టం చేశారు. ఒకవేళ వర్మ చెబుతున్నట్లు ఆ వాహనంలో నిజంగా డబ్బు ఉంటే అది ఎక్కడుందో చెబితే తమ కార్యకర్తలు తెచ్చుకుంటామంటున్నారని, ఎక్కడుందో ఆయనే చెప్పాలని గీత అన్నారు. డబ్బు ఎవరు ఎక్కువ ఖర్చు పెడుతున్నారో, ఎవరు ఎక్కువ ఖర్చు పెడతారో పిఠాపురం ప్రజలకు తెలుసని చెప్పారు. ఎవరి పార్టీ ప్రచారాలు వారు చేసుకోవడంలో తప్పు లేదని, తప్పుడు ఆరోపణలతో తప్పుదారి పట్టించాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. అసత్య ప్రచారాలతో ప్రజల మద్దతు వస్తుందనుకుంటే పొరపాటని ఆమె చెప్పారు. వైఎస్సార్ సీపీకే ప్రజల మద్దతు ఎక్కువగా ఉండటంతో ఓటమి భయంతోనే వర్మ లేనిపోని ఆరోపణలకు దిగుతున్నారని మండిపడ్డారు. ఎవరు ఎలాంటి వారో పిఠాపురం ప్రజలకు తెలుసని, అసత్య ప్రచారాలు చేస్తే వారు అంగీకరించబోరని చెప్పారు. నిజాయతీగా ఎన్నికల ప్రచారానికి వెళ్లలేని స్థితిలో టీడీపీ కూటమి ఉందని దుయ్యబట్టారు. తమది రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన పార్టీ అని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి బాటలు వేసిన నేత అని, ఆయన చేసిన అభివృద్ధిని వివరిస్తూనే తాము ఎన్నికలకు వెళ్తాం తప్ప అభూత కల్పనలపై ఆధారపడబోమని స్పష్టం చేశారు. తనకు ప్రజలు బ్రహ్మరథం పడుతూంటే వణుకు పుట్టే ఇలాంటి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, ఇకనైనా వాటిని మానుకోవాలని గీత హితవు పలికారు.



నిఘా బృందాలు సమర్థంగా పనిచేయాలి


ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ బృందాలతో అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో కిశోర్

కాకినాడ రూరల్: ఎన్నికల నిఘా బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని రూరల్ నియోజకవర్గ ఆర్వో ఇట్ల కిశోర్ సూచించారు. సర్పవరం జంక్షన్ వద్ద ఆర్వో కార్యాలయంలో ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ బృందాలతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని, ముఖ్యంగా కోడ్ ఉల్లంఘనలపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ విజయ ప్రసాద్, డిప్యూటీ సురేష్ పాల్గొన్నారు.

ఆహ్లాదకరం.. సాగర తీరం..


పర్యాటకులతో కిటకిటలాడిన ఉప్పాడ సాగరతీరం

కొత్తపల్లి: ఉప్పాడ సాగర తీరం ఆహ్లాదకరం ఉంది. కోనపాపపేటతో పాటు ఉప్పాడ తీర ప్రాంతం మంగళవారం పర్యాటకులతో కిటకిటలాడింది. ఉగాది సందర్భంగా కొత్తపల్లి మండలం నుంచే కాకుండా పిఠిపురం, సామర్లకోట, గొల్లప్రోలు, కత్తిపూడి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి ఆహ్లాదంగా గడిపారు. ఉప్పాడ నుంచి నేమం వరకు ఉన్న బీచ్ రోడ్డులో పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది.